క్లుప్తంగా

సాలూరు - విశాఖపట్నం రైలు ట్రయల్ రన్ రేపు

సాలూరు: సాలూరు నుండి బొబ్బిలి మీదుగా విశాఖపట్నం ట్రైన్‌కు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు సమాచారం. విశాఖపట్నంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమై, 12.30కు బొబ్బిలి, 1.10 గంటలకు సాలూరుకు చేరుకుని, 1.20కు సాలూరు నుండి తిరుగు ప్రయాణమై సాయంత్రం 4.30 గంటలకు విశాఖపట్నం చేరుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు రైల్వే అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలోనే ఈ రెగ్యులర్ సర్వీసు ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

అభివృద్ధి పనులకు ఆమోదం


గ్రామసభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: మండలంలోని పెదపధం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. సర్పంచ్ రెడ్డి సుకన్య అధ్యక్షతన మండలంలో బాగువలస గ్రామంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. సభలో పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో రుద్ర భూములకు రహదారులు, చెరువు గట్లు వద్ద కొబ్బరిచెట్లు నాటడం, రోడ్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని గుర్తించి ఆమోదించారు. అందరు సమష్టిగా పనిచేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని వైస్ ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, పలువురు వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్త దానం చేస్తున్న యువత

పార్వతీపురంటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అపోహలు వీడి ఆరోగ్యవంతులైన వారందరూ రక్తదానం చేయాలని డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. తన పుట్టినరోజు సందర్భంగా కర్షకమహర్షి హాస్పిటల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన మనిషి ప్రతీ మూడు నుంచి నాలుగు నెలలకు 350 మిల్లీలీటర్ల రక్తం ఇవ్వవచ్చన్నారు. 30 మంది నుంచి బొబ్బిలిలోని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ పృధ్వీమోహన్, వైద్యులు ప్రతిమాదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



మక్కువ: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు జరిపేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పలు గ్రామాలలో మండపాలను కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. స్థానిక కుమ్మరివీధి కళాకారులు దుర్గమ్మ ప్రతిమలను వివిధ రూపాలలో తయారుచేశారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు బుధవారం మక్కువ చేరుకొని, వాహనాలపై దుర్గమ్మ ప్రతిమలను తరలించగా, మరి కొంతమంది భక్తులు గురువారం తెల్లవారుజామున ప్రతిమలను తీసుకెళ్లనున్నారు.

శ్రమదానం


మక్కువ - చినబోగిలి మధ్య గుంతలను పూడ్చుతున్న యువకులు

మక్కువ: మండల కేంద్రం మక్కువ నుండి సీతానగరం మండలం చినబోగిలి గ్రామాల మధ్య రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ విషయమై అధికారులు, పాలకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో యువకులే నడుం బిగించారు. మండలంలోని వెంకటభైరిపురం గ్రామం వద్ద రహదారిలో ఏర్పడిన పెద్ద గోతులను శ్రమదానంతో బుధవారం పూడ్చారు. యువత శ్రమదానంతో గోతులు పూడ్చడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి ప్రదాతలకు సత్కారం

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామాభివృద్ధికి పాటుపడిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సచివాలయం ఆవరణలో సర్పంచ్ కె.రాధ ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం సత్కరించారు. గాంధీజీ జయంతి సందర్భంగా అభివృద్ధి ప్రధాతలను సత్కరించడం ముదావహమని వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.శ్రీనివాసరావు అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేసిన ప్రముఖలను సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ మజ్జి శోభారాణి


సీతానగరం: మండల కేంద్రంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీక్లబ్ సభ్యులు


బలిజిపేటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జాతిపిత అడుగుజాడల్లో నడుద్దాం


పార్వతీపురం టౌన్: ఐటీడీఏ కార్యాలయంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీఓ అశుతోష్ శ్రీవాస్తవ


పార్వతీపురం టౌన్:ఎస్ఎన్ఎం కాలనీలో జాతిపిత గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో అందరం నడుద్దామని పలువురు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా పలుచోట్ల బుధవారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అహింస విధానంలో ముందుకు సాగి భారతీయులకే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా గాంధీజీ నిలిచారన్నారు. నేటి యువతరం ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన గురుతరమైన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


పార్వతీపురం టౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డా.మంచుపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు


సీతానగరం: గాదెలవలసలో మహాత్ముని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణమ్మ, మాజీ సర్పంచ్‌లు

కల్తీ విత్తనాల విక్రయదారులను అరెస్టు చేయాలి

మక్కువ:

కల్తీ విత్తనాలను గిరిజనులకు విక్రయించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని నంద గ్రామ సమీపంలో మొక్కజొన్న పంటను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద గ్రామానికి చెందిన సుమారు 15 మంది గిరిజన రైతులు, మక్కువలోని రెండు ఎరువుల దుకాణాల వద్ద అడ్వెంట్ 9293 రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి సుమారు 30 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారని తెలిపారు. విత్తనం నాటిన తరువాత పంట ఏపుగా పెరగలేదన్నారు. పంట పక్వానికి వచ్చే సమయంలో కంకెలు రాకపోవడంతో గిరిజన రైతులు లబోదిబోమంటున్నారని తెలిపారు. కల్తీ విత్తనాలు కావడం వల్లే గిరిజనులు సాగు చేసిన పంట నష్టపోయారని పేర్కొన్నారు. రైతులు


నంద గ్రామం సమీపంలో పాడైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వామపక్ష నాయకులు

కొనుగోలు చేసిన విత్తనాలకు వ్యాపారులు రసీదులు ఇవ్వలేదన్నారు. కల్తీ విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామన్నారు. ఈ విషయమై ఏఓ బి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మొక్కజొన్న పంట నష్టపోయిన విషయం తెలిసి సోమవారం వెళ్లి పరిశీలించానని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు.

విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్న పాలకులు


కలెక్టరేట్ ఆవరణలో రిలే నిరసన దీక్షలలో పాల్గొన్న విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ సభ్యులు

పార్వతీపురం టౌన్: విశాఖ ఉక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పుట్టినప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి కేవలం రూ.9 వేల కోట్లు మాత్రమేనని చెప్పారు. కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటి వరకూ పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లకు పైగా చెల్లించిందన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద భారీ పరిశ్రమ అని, రైతులు 20 వేల ఎకరాల భూమిలిచ్చి త్యాగం చేశారని, 32 మంది ప్రాణాల బలిదానంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు విశాఖ స్టీలు సాధించుకున్నారన్నారు. రాష్ట్రంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల ఎందుకు ఇంత వివక్ష అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టి ప్రత్యేక హోదా లేకుండా చేసి, ఉన్న ఏకైక భారీ పరిశ్రమను విదేశీ కంపెనీలకు అమ్ముకోవడానికి చూస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా కట్టబెట్టాలనే కుట్ర వేగంగా సాగుతోందని ఆరోపించారు.

ఎన్నికల ముందు పూర్తి హామీనిచ్చి గద్దెనెక్కిన కూటమి

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు పూర్తి హామీ నిచ్చిందని, తెలుగుదేశం ప్రభుత్వం మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. టీడీపీ ఎన్‌డీఏలో భాగస్వామ్యంగా ఉండి కూడా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎందుకు కాపాడలేకపోతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకత్వం కేంద్ర బీజేపీపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్‌ను కాపాడాలన్నారు. ఆంధ్రాలో పరిశ్రమల మణిహారమైన విశాఖ స్టీల్‌ను రక్షించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి మూడు మాసాలైనా దిగజారుతున్న పరిస్థితిలో చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీక్షలకు సింహాద్రి దుర్గారావు, ఈవీ నాయుడు, సీఐటీయూ కార్యదర్శి వై.మన్మధరావు, వి.ఇందిర, జి.కృష్ణ, గొర్లి వెంకటరమణ తదితరులు సంఘీభావం తెలిపారు.

ఇసుక కోసం దీక్షలు


నిరసన దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పార్వతీపురం: గృహ నిర్మాణాలకు ఉచిత ఇసుక అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని సీఐటీయూ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉచిత ఇసుకను గృహనిర్మాణాలకు అందుబాటులో ఉంచాలని కోరుతూ రెండో రోజు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ ఇసుక రీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో ఇసుక లభించకపోవడంతో గృహ నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. దీంతో అన్ని వర్గాల వారు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ అక్టోబర్ 4న కలెక్టరేట్ వద్ద దీక్ష, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్మంలో నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ, సూరిబాబు, జి.దిలీప్ కుమార్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అంతా సహకరించాలి


చినబొండపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

పార్వతీపురం: గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని చినబొండపల్లి సర్పంచ్ జి.శంకరరావు అన్నారు. మండలంలోని చినబొండపల్లి, ములగ, వెంకంపేట, పుట్టూరు తదితర గ్రామాలలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గ్రామసభలను నిర్వహించి గ్రామాభివృద్ధికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కూలి నిలిచిన రాకపోకలు


సారిక బంగారమ్మ గుడి వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

సాలూరు: మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన ఉరుములతో కూడిన భారీ వర్షానికి సారిక గ్రామంలో బంగారమ్మ గుడి వద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. దీంతో ఈ మార్గం గుండా ఆంధ్రా - ఒడిశా మధ్య రాకపోకలు నిలిచాయి. మారుమూల అటవీ ప్రాంతం కావడం, ఎక్కువగా తుప్పలతో నిండి ఉండడంతో సాయంత్రం ఈ ప్రాంతంలో కొటియా గ్రూపుల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టు అడ్డుగా ఉండడంతో సాలూరు - నేరెళ్లవలస బస్సు సర్వీసును వెనక్కి వెళ్లిపోయింది.

పలగరలో గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న రాజు

బలిజిపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ఎస్‌వీఆర్ఎం రాజు అన్నారు. పలగరలో అజయ్ ఏర్పాటు చేసిన గాంధీ, అంబేడ్కర్, భగత్‌సింగ్, సుందరయ్య గ్రంథాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి గ్రంథాలయాల ఆవశ్యకత ఉందన్నారు. దీన్ని అన్ని వయసుల వారు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అజయ్, బుల్లిబాబు, సింహాచలం, సంజీవనాయుడు, శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో అందరూ భాగస్వాములు కావాలి

- కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్


ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛత భారత్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఎన్ఎం నగర్ కాలనీలో గల పార్కు ఆవరణలో శ్రమదాన కార్యక్రమంలో సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి బుధవారం ఆయన పాల్గొన్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. పార్కులో మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేసి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొని పార్కును శుభ్రం చేసారు. అక్కడ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లో ఫొటో తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ మహాత్ముని స్ఫూర్తిగా సమాజ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి అందించాలన్నారు. సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాస్తవ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన ఆలోచనలు కూడా మంచిగా ఉంటాయనే గాంధీజీ సిద్ధాంతాలను జట్టు ఫౌండేషన్ ఆచరణలో చూపిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జట్టు ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని నూరు శాతం జట్టు ఫౌండేషన్ అమలు చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమం వ్యవస్థాపకులు వెనిగొండ్ల పద్మజమ్మ, నాబార్డు డీడీఎం దిలీప్, డి.పారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

సాలూరు:మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అంజలిదేవి, పీడీ రవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి విజయనగరం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన అండర్ - 14, 17 స్కూల్ గేమ్స్‌లో పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు హేండ్ బాల్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్ తదితర విభాగాల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 6 ,7, 8 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ అంజలిదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న ఏఈఎస్ జీవన్‌కుమార్

సీతానగరం: మూడు మండలాల్లో మద్యం దుకాణాల నిర్వహణకు అర్జీదారుల నుంచి స్థానిక స్టేషన్ హౌస్ కార్యాలయం వద్ద దరఖాస్తులను స్వీకరించనున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా ఏఈఎస్ బి.జీవన్‌కిశోర్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు సీఐ పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం సర్కిల్ పరిధిలో ఉన్న గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల్లో మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఈ నెల 9వ తేదీలోగా వ్యక్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నిర్దేశించిన గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్ఐ, హెచ్‌సీలు, సిబ్బంది ఉన్నారు.

ఏనుగుల హల్‌చల్

పార్వతపురం టౌన్: పార్వతీపురం మండలంలో చినమరికి సమీపంలో కృష్ణపల్లి - బండిదొరవలస గ్రామాల మధ్య బుధవారం రాత్రి ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ గ్రామాల మధ్య మొక్కజొన్న తోటలో సంచరించి పంటలు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి ఏనుగులు రావడంతో పరిసర ప్రాంతాల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.